# ఇన్లాండ్ లెటర్ కథలు



## పైవాడు

వినయ్‌కి చాలా చిరాగ్గా ఉంది. ఈ మధ్య ఏ పని చేద్దామనుకున్నా ఏదో ఒక అడ్డంకి, ఇబ్బంది ఎదురవ్వటం-పని కాకపోవటం జరుగుతూంది. పైగా ఇంట్లో భార్యా పిల్లలకి మెడికల్ ఎక్స్‌పెన్సెస్ కూడా బాగానే అవుతున్నాయి. మొత్తానికి ఈ మధ్య తనకీ ఫ్యామిలీకి ఏమీ బాగునట్లనిపించట్లేదు. కుర్చీకి చతికిలబడి కూర్చున్న వినయ్ తలను పైకెత్తగా అప్రయత్నంగా అతని దృష్టి గోడపై కాలెండర్లో చిద్విలాసంగా తపస్సు చేసుకుంటున్న శంకరునిపై నిల్చింది. వెంటనే ఏదో స్ఫురించినట్లయి వినయ్ లేచాడు. "ఒరేయ్ బాబీ! ఈ వేళ సాయంత్రం మనం. గుడికి వెళ్దాంరా" అన్నాడు. బాబిగాడేం పట్టించుకోకుండా ఆడుకుంటున్నాడు. అక్కడే టిఫిన్లు సర్దుతున్న శ్రీమతి "అవునండీ ఈ వేళ హనుమజ్జయంతి కూడానూ-గుడికెళ్ళి ఆ ప్రక్కనే ఆ స్వామిని కూడా దర్శించుకోవచ్చు- అన్నది. అందరూ భోజనాలు కానిచ్చి, బాబిగాడు స్కూలుకి, పెద్దవాళ్ళిద్దరూ ఆఫీసుకి బయల్దేరారు. సాయంకాలం ఆరుగంటలకి అందరూ గుడికెళ్ళారు. స్వామీ నీ గుడికి వస్తున్నాను నాకు మనశ్శాంతిని ప్రసాదించేలా నీవేదైనా నాకు చిన్న మహిమను చూపించు అనుకున్నాడు సెంటిమెంటల్‌గా వినయ్ మనసులోనే. గుళ్ళో గంటలు గణగణ మ్రోగాయి. రద్దీ అంతకంతకూ పెరిగిపోతుంది. చెప్పులు విడిచి అందరూ లోపలికడుగుపెట్టారు. ఆ వేళ ప్రత్యేకత చేత ఆంజనేయస్వామి గుళ్ళోనే అధికంగా జనం ఉన్నారు. అందరితో బాటు దర్శనం చేసుకుని ప్రసాదం స్వీకరించి శివుని వద్దకు వెళ్ళారు. అక్కడ ప్రక్కనే వేదిక ఏర్పాటు కనిపించింది. ఎవరో స్వామీజీ వచ్చి ఉపన్యసిస్తారు అని తెలిసింది. కాసేపు వినయ్ అలానే కూర్చున్నాడు. చాలా సేపటికి స్వామీజీ వచ్చారు. అందరూ స్వామీజీ దర్శనం చేసుకున్నారు. కానీ బాబిగాడికి ఆకలవుతూండటంతో ఇక ఉపన్యాసం వినే టైము లేక స్వామీజీకి నమస్కరించి వెనుదిరిగారు వినయ్ ఫ్యామిలీ. బయటకు రాగానే-చెప్పులు తొడుక్కుందామంటే బాబిగాడి చెప్పలు మాయం అరె! ఎవరో చెప్పల్ని దొంగిలించారే అంది శ్రీమతి. మరోప్రక్కన నిల్చున్న మరో స్త్రీ అవునండీ-మా అమ్మాయి చెప్పలతో బాటు నా చెప్పలూ (రెండు జతలు) పోయాయి. అంది వాపోతూ- "అయినా గుడివాళ్ళు కాస్త శ్రద్ధ తీసుకోవాలి. చెప్పలు పోకుండా కట్టుదిట్టమైన చర్య తీసుకోవాలి. లేకపోతే ఎంతమంది ఇలా చెప్పలు పోగొట్టుకుంటారో పాపం" అంటున్న శ్రీమతితో వినయ్ పోనీలే ఏంచేస్తాం-చెప్పలు పోతే బాధపడకు లక్ష్మీ! దరిద్రం వదిలిపోయిందనుకోవాలి. అందుకే చింతించవద్దు. పోనీలే నాన్నా-నీకో కొత్త చెప్పల జత కొనిస్తాలే అంటూ-ఏడుస్తున్న బాబిగాడికి సర్దిచెప్పి బయలుదేరాడు వినయ్. స్వామీ నీ లీల ఇలా చూపించావా! అని మనసులోనే నిట్టూర్చాడు వినయ్. ఆహా! ఎవరో పేదవాళ్ళకు నీ గుడి వద్దనే చెప్పలను అందిస్తున్నావు. నాకేమో ఇలాంటి లీలను చూపించావు. ఏమో నాలానే ఏ పేదవాడో-ఇలానే నీ గుడి వద్ద లీలలను చూపించమనుంటాడు. అందుకే చెప్పలు చూసేవాళ్ళెక్కరూ ఇక్కడ లేరు. నీవు నీ లీలను బాగానే చూపించావు. అందుకే నీవు దేవుడవయ్యా-అనుకున్నాడు మనసులోనే స్వామికి దణ్ణం పెడుతూ.

—రాజవరం
ఉషారాణి

## మరపు రాని రోజు



పనులన్నీ ముగించుకుని కాసేపు నడుం వాల్చింది కోమలి, ఇంతలో కాలింగ్ బెల్ శబ్దం వినిపించి తలుపు తీసింది. ఎదురుగా అపరిచిత వ్యక్తి. అతను చనువుగా లోపలికి రావడం గమనించి "ఎవరండీ మీరు? ఎవరు కావాలి?" అని ప్రశ్నించింది "నేనండీ' మదన్‌ని, నన్ను మీరు గుర్తు పట్టలేదనుకుంటా" అంటూ సోఫాలో కూర్చున్నాడు. కోమలికి ఎంత ప్రయత్నించినా అతనెవరో గుర్తుకి రావడం లేదు. వాళ్లుంటున్న చోటు చుట్టూ ఎక్కువ ఇళ్ళుగూడా లేవు. మిట్ట మధ్యాహ్నం వున్న ఇంటి వాళ్ళు కూడా నిన్న ఊరికి వెళ్లారు. మదన్ లేచి వంటింటి వైపుకి దారితీయడంతో కోమలి భయం మరింత అధికం అయ్యింది. ఎయ్ నిన్నే బయటికి నడు కాస్త కటువుగానే అంది. మదన్ వెనక్కి వచ్చి "కాస్త మంచి నీళ్లివ్వండి" అంటూ టివి ఆన్ చేశాడు. అప్పుడు గమనించింది అతను తాగి ఉన్నాడని. వెంటనే ఎదురుకుండా వున్న షాప్ అతన్ని పిలిచింది. షాపువాడు రాగానే అతనితో ఏదో మాట్లాడి పంపించేశాడు. కోమలకి దడ తగ్గలేదు. భర్తకి ఫోన్ చేద్దామనుకుంది. ఇంతలో రవి అనబడే కోమలి భర్త రానేవచ్చాడు. రారా రవి! "మీ ఆవిడ నన్ను పూర్తిగా మరిచిపోయింది. అందుకే కొంత యిలా యాక్షన్ చేశాను. పాపం చాలా భయపడి పోయింది. అంటూ చిన్న నాటి వారి- స్నేహాన్ని గుర్తు చేశాడు. చాలా సంవత్సరాలు కావడం వలన గుర్తు పట్టిన మదన్‌ని మనసారా కౌగిలించుకున్నాడు రవి. హమ్మయ్య అనుకుంది.

—కోమలి సీతాదేవి.

కొత్తరచయితలు మాత్రమే ఇన్లాండ్‌లెటర్ కథలు రాసి పంపాలి.